# పోలీసులతో కలిసి రాజకీయ హత్యలు

## హత్యోన్మాదులను ఉరికొయ్య ఎక్కిస్తానని ఉద్ఘాటన ☆ కాంగ్రెస్‌పై బాబు ధ్వజం

కర్నూలు - న్యూస్‌టుడే

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుకు గుండె కోతే మిగిలిందని తెదేపా అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రతి 14 గంటలకు ఓ అన్నదాత చొప్పున ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఇప్పటివరకు 2500 మంది అకాల మృత్యువు పాలయ్యారని ఆందోళన వ్యక్తంచేశారు. తెదేపాకు చెందిన బలమైన నాయకులను కాంగ్రెస్ నేతలు పోలీసులతో కలిసి అంతమొందిస్తున్నారని ఆరోపించారు. శనివారం మీకోసం యాత్రలో భాగంగా పత్తికొండ, దేవనకొండల్లో పర్యటించిన ఆయన జనసంద్రాన్ని చూసి ఉప్పొంగిపోయారు. వారిని ఉద్దేశించి ప్రసంగించారు. పత్తికొండలో విలేకరులతో మాట్లాడారు. ఆ సారాంశం ఆయన మాటల్లోనే..

రాష్ట్రంలో దాదాపు 5600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా.. కాంగ్రెస్ వివిధ రకాలుగా జల్లెడ పట్టి 2500 మందికి కుదించింది. ఆత్మహత్యల నివారణకు 14 జిల్లాల్లో కాంగ్రెస్ ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజి పూర్తిగా విఫలమైంది. తెదేపా పోరాటాల ఫలితంగా రుణ మాఫీ చేయడానికి ముందుకు వచ్చిన ప్రభుత్వం అమల్లో మాత్రం ఎక్కువ మంది లబ్ధిపొందకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించింది. రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రిశరద్‌పవార్ వరికి మద్దతు ధర రూ.1000 ప్రకటిస్తామని హామీ ఇచ్చి ఢిల్లీ వెళ్లిన తరువాత రూ.850 చేశారు. కాంగ్రెస్‌ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేదొకటి అనడానికి ఇదే ఉదాహరణ. రైతులకు సరిపడా ఎరువులు ముందుగా సేకరించలేదు. గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన రైలు ప్రమాదం అనుమానాస్పదంగా ఉంది. పేలుడుకు సంబంధించిన పరికరాలు కూడా దొరికాయి. 32 మంది చనిపోతే రైల్వే శాఖ మంత్రి కాని, సహాయ మంత్రి కాని పరిసరాల్లోకి రాకపోవడం దారుణం.

### హత్యోన్మాదులను వదలను

రాష్ట్రంలో తెదేపాకున్న బలమైన నాయకులందర్నీ కాంగ్రెస్ నేతలు మట్టుపెడుతున్నారు. వీరికి పోలీసులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. పరిటాల రవిని, కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడిని అలానే హత్య చేయించారు. హత్యోన్మాదానికి పాల్పడిన వారెవరినీ వదిలే ప్రసక్తే లేదు. అందరినీ ఉరికొయ్య ఎక్కించేంత వరకు నిద్రపోను. బడుగులకు అండగా ఉంటున్న తెదేపాను గెలిపించడం ద్వారా దుష్ట కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పండి. కప్పట్రాళ్ల కుటుంబానికి మేం అండగా ఉంటాం. పార్టీ తరఫున రూ.50 వేలు చొప్పున ఎనిమిది కుటుంబాల వారికి అందచేస్తున్నాం. చనిపోయిన వారి కుటుంబాలలో ఇద్దరేసి పిల్లలను ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా చదివిస్తాం.

### సుర్జీత్ మరణం పూడ్చలేనిది

సీపీఎం సీనియర్ నేత సూర్జిత్ మరణం పూడ్చలేనిది. ఆయనతో కలిసి పని చేసే అవకాశం నాకు కలిగింది. నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో ఆయన తీసుకున్న చొరవ మరువలేనిది. అంత్యక్రియలకు హాజరు అవ్వడం నా బాధ్యత. అందుకుగాను మీకోసం యాత్రను ఓ రోజు వాయిదా వేస్తున్నా. బాబు సభలో కప్పట్రాళ్ల వెంకటప్పనాయుడు కుమార్తె సుశీలమ్మ మాట్లాడుతూ తన తండ్రిని కాంగ్రెస్ వర్గీయులు దారుణంగా చంపారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తెదేపాను గెలిపించి తమ సానుభూతిని వ్యక్తీకరించాలని ప్రజలకు సూచించారు. కాగా కర్నూలులో చంద్రబాబు యాత్ర జన సంద్రమే అయింది. ప్రతి చోటా కార్యకర్తలు వేలసంఖ్యలో హాజరయ్యారు.



కర్నూలు జిల్లా పత్తికొండలో శనివారం సాయంత్రం ఓ ఆటో నడిపే ప్రయత్నంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు

**బాబు సమావేశాల్లో నిఘా వర్గాలు:** కర్నూలు జిల్లాలో చంద్రబాబు మీకోసం యాత్రపై నిఘా వర్గాలు సమాచారం సేకరిస్తున్నాయి. బాబు పర్యటన ప్రారంభమైనప్పటి నుంచి నియోజకవర్గాల వారీగా సమాచారం సేకరించడానికి ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచి పోలీసులు కార్యకర్తల్లో కలిసిపోతున్నారు. బాబు ఆదోనిలో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల సమీక్ష, పత్తికొండలో ఆదోని, ఆలూరు నియోజకవర్గాల విశ్లేషణ చేపట్టారు. కార్యకర్తలతో పాటు నిఘా వర్గాలు కూడా అందులో కూర్చోవడం విశేషం.